క్లుప్తంగా

పాఠశాలల్లో జెండా ఎగురవేయాలి

కెరమెరి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఉదయం 9 గంటలలోపు జాతీయ జెండా ఎగురవేయాలని ఎంఈవో సుధాకర్, ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ప్రజాప్రతినిధులకు ఆహ్వానం లేదన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

వాంకిడి: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేసి తమ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడు వినయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశలకు నష్టం కలిగించే పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని, అసెంబ్లీ ఎన్నికల ముందు, తర్వాత కాంగ్రెస్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఈమేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో లక్ష్మి, మాన్కుబాయి, కిష్టుబాయి, భీంబాయిలు ఉన్నారు.

లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘాలకు ఎన్నికలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఆరు లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి రబ్బానీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం ఆరు లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘాలకు ఈ నెల 6 నుంచి 28 వరకు తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల ఎన్నికల అథారిటీ ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాలకు ఎఫ్ఏసీ మోహన్‌ను 83286 83964 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి


శిశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

వాంకిడి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ సూచించారు. శనివారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, గరిష్ట ఉష్ణోగ్రతల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కృపావాణి, ఎంఎల్‌హెచ్‌పీ మమత, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఈవో

లింగాపూర్: లింగాపూర్ క్లస్టర్ పరిధిలో అధికారులు శనివారం పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఏఈవో తోడసం శ్రీనివాస్ నాయక్‌పోడ్‌గూడ, మోతిగూడ గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు నకిలీ విత్తనాలను కొనద్దని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ సలాం సోనేరావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'బడిబాట'లో భాగస్వాములు కావాలి

బెల్లంపల్లిరూరల్(తాండూర్): 'బడిబాట'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహణ కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మండల పరిధిలోని ప్రతీ గ్రామ పంచాయతీలో బడిబాట కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఐకేపీ వీవోలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించుటకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

జీలుగతో భూమికి జీవం



రైతులకు జీలుగ విత్తనాలు అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

- అందుబాటులో విత్తనాలు
- సబ్సిడీపై అందజేత

పెంచికల్‌పేట్: నేల సారాన్ని పెంచడంలో జీలుగ విత్తనాలు కీలక పాత్ర పోషిస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. నేటి కాలంలో పంట పొలాల్లో రైతులు వరి సాగులో ఇష్టారీతిన రసాయన ఎరువులను వినియోగిస్తున్నారు. దీంతో నేల సారం దెబ్బతిని, తద్వారా పంట దిగుబడి తగ్గిపోతుంది. జీలుగ, పచ్చి రొట్ట ఎరువులతో మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

సారవంతమైన నేలకు..

ఎకరానికి 10 నుంచి 12 కిలోల చొప్పున జీలుగ విత్తనాలను వేసుకోవాలి. దుక్కిలో 20 నుంచి 30 కిలోల యూరియా వేసి తర్వాత జీలుగ విత్తనాలను చల్లుకోవాలి. 45 నుంచి 55 రోజుల్లో జీలుగ పూత దశకు వస్తుంది. ఎదిగిన జీలుగ మొక్కలను రోటవేటర్ సహాయంతో నేలలో కలియదున్నాలి. అనంతరం 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ దుక్కిలో వేయాలి. మొక్క అవశేషాలు కుళ్లి పచ్చి రొట్ట ఎరువు తయారవుతుంది. జీలుగ మొక్కలను కలియదున్నడం వలన తయారయ్యే ఎరువు పశువుల ఎరువు కంటే పదిరెట్లు ఎక్కువ సారవంతం చేస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జీలుగ పంట చౌడు భూములు, వరి పండించే భూముల్లో నేల సారాన్ని పెంచడానికి అనుకూలంగా పని చేస్తుంది. ఒక ఎకరానికి 12 నుంచి 15 కిలోల జీలుగులు విత్తడం వలన 8 నుంచి 10 టన్నుల పచ్చి రొట్ట లభిస్తుంది. అంతే కాకుండా ఒక టన్ను పచ్చి రొట్ట ఎరువులో ఆరు కిలోల నత్రజని, ఒకటి నుంచి ఒకటిన్నర కిలోల భాస్వరం, పొటాషియం భూమిలో స్థిరీకరించబడతాయి. 30 కిలోల జీలుగ విత్తన బస్తా ధర రూ.2790 ఉండగా 60శాతం రాయితీపై రైతులకు రూ.1116 అందజేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు వేదికల్లో పట్టాపాసుపుస్తకాలు, ఆధార్‌కార్డు జిరాక్సుతో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలి.

– రాజులనాయుడు, ఇన్‌చార్జి ఏడీఏ, పెంచికల్‌పేట్

పచ్చి రొట్ట సాగులో మెలుకువలు..

- పంటను కోయగానే తేమను సద్వినియోగం చేసుకొని విత్తనాలను విత్తుకోవాలి. తేమ లేని ప్రాంతాల్లో వేసవిలో దుక్కి దున్ని వర్షాలు పడగానే విత్తుకోవాలి.
- నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభదాయకం.
- రెండు పంటల మధ్య కాలవ్యవధిలో విత్తుకొని కలియదున్నవచ్చు.

పచ్చి రొట్ట సాగుతో లాభాలు..

- పొలంలో జీలుగ విత్తనాలు కలియదున్నితే నేలకు, ఆపై వేసే పంటకు ప్రయోజనం చేకూరుతుంది.
- మొక్కలకు రెండు శాతం నత్రజని, సూపర్ ఫాస్పేట్ అదనంగా అందుతుంది.
- జింక్, మాంగనీసు, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులు పంటలకు అందుతాయి.
- నేలలో కరగని మూలకాలు పంటకు అనుకూలంగా మార్చుతాయి.
- పంట పొలంలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.
- వానపాముల ఉత్పత్తికి దోహదపడుతుంది.
- పంట పొలాల్లో కలుపు అడ్డుకుంటుంది.
- నేల భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నీరు నేలలోకి ఇంకే గుణం పెరుగుతుంది.
- నేలలో సేంద్రియ పదార్థం వేయడం వలన సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయి.
- భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా ఉంటుంది.

ఘనంగా హనుమాన్ జయంతి


ఆసిఫాబాద్‌అర్బన్: ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో హనుమాజ్ పెద్ద జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఎల్కపల్లి అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు విష్ణుచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి అభిషేకం నిర్వహించి అరటిపండ్లు, తమలపాకులతో అలంకరించారు. అనంతరం పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, మహానివేదన, మంత్రపుష్ప కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: హనుమాన్ జయంతి వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ స్వామివారికి ఉదయం 6 గంటలకు గణపతి పూజ, నవగ్రహారాధన, స్వస్తి పుణ్యాహవచనం, లఘున్యాసపూర్వక రుద్రాభిషేకం, పుష్పార్చన, మంగళహారతి, మహామంత్రపుష్పం అనంతరం ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఆలయంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, కొక్కిరాల విశ్వప్రసాద్, అజ్మీరా శ్యాంనాయక్, ఎంపీపీ మల్లికార్జున్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వివేక్, రూప్‌నార్ రమేశ్, గుండా వెంకన్న, శ్రీనివాస్, సుధాకర్, నారాయణమూర్తి, యాదగిరి, రాధాకృష్ణచారి, మధు భక్తులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: హనుమాన్ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ, మండల హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలు జరుపుకున్నారు. పలు ఆలయాల్లో సింధూర పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులర్పించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి


అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని గుర్తు చేశారు. వీరి వెంట నాయకులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, కెరమెరి వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాంలు ఉన్నారు.

నాలుగు గోడల మధ్య 'ప్రజావేదిక'

- ఎన్నికల నియమావళి ఎఫెక్ట్
- అధికంగా కొలతల్లో తేడాలు


రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

కెరమెరి: ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఉపాధి కూలీలు, ప్రజల మధ్య నిర్వహించాల్సిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ ప్రజావేదిక నాలుగు గోడల మధ్య జరిగింది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉపాధిహామీ పథకం ప్రజావేదిక ఈసీ, టీఏ, ఎఫ్ఏలతో పాటు గ్రామ కార్యదర్శులతో కొనసాగింది. మండలంలో 1, ఏప్రిల్, 2023 నుంచి 31, మార్చి, 2024 వరకు వివిధ రకాల 492 పనులు చేశారు. దీనికి మెటీరియల్‌తో పాటు కూలీలకు వేతనాలు రూ.7,86,68,046లు వెచ్చించారు. మండలంలో మొత్తం జాబ్‌కార్డులు 9981 ఉండగా.. 18,399 మంది కూలీలు ఉన్నారు. అందులో యాక్టివ్ జాబ్ కార్డులు 8002 ఉండగా, 13,974 మంది కూలీలు యాక్టివ్‌గా ఉన్నారు.

పనుల కొలతల్లో తేడాలు!

ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన ప్రజావేదికలో పలు అంశాలు తెలియవచ్చాయి. డీఆర్‌డీవో సురేందర్ ఆధ్వర్యంలో కొనసాగిన ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు నివ్వెరపోయే అంశాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. చాలా చోట్ల చేసిన పనులకు తేడాలు వచ్చాయి. పనుల్లో సరైన విధంగా పర్యవేక్షణ లేకపోవడంతో పాటు టార్గెట్ పూర్తి చేయాలని జిల్లాస్థాయి అధికారులు ఒత్తిడి తేవడంతో టార్గెట్ పూర్తి కోసం కొన్ని చోట్ల కూలీల హాజరు ఎక్కువగా వేసినట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల మస్టర్లు లేకుండా పేమెంట్ చేసినట్లు సమాచారం. మరికొన్ని చోట్ల పని లేని చోట పని చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసినట్లు తనిఖీ సభ్యులు తెలిపారు. పనిచేయని వారికి కూడా డబ్బులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఒకరి పేరిట మరొకరు పని చేసినట్లు, చేసిన వారికి డబ్బులు రాకపోవడం, చేయని వారికి పేమెంట్ చేయడం వంటి అంశాలు కూడా బహిర్గతమయ్యాయి. కొన్నిచోట్ల ఎంబీ రికార్డు చేయకుండానే పేమెంట్ అయినట్లు పేర్కొన్నారు. టీఏ, ఎఫ్ఏలు కూడా తక్కువ సంఖ్యలో ఉండడం వల్ల ఒక్కొక్కరికి మూడు నుంచి ఐదు గ్రామపంచాయతీల పర్యవేక్షణ అప్పగించడంతో వారికి ఎక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కాగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు మాట్లాడుతూ అవకతవకలకు బాధ్యులైన ముగ్గురు సిబ్బందిపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. 26 మంది సిబ్బందికి షోకాజు నోటీసులు అందించనున్నట్లు తెలిపారు. మొత్తంగా రూ.1.15 లక్షల జరిమానా విధించడంతో పాటు రూ.2.48 లక్షలు రికవరీకి ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఎం(స్టేట్ టీం మానిటర్) వేణు, అంబుడ్స్ పర్సన్ సాయిశ్రీ, అసిస్టెంట్ ఆడిటర్ క్రిష్ణమూర్తి, క్యూసీ రమేశ్, ఎస్ఆర్‌పీ మహేశ్, ఎంపీడీవో అంజద్ పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యానాయక్, టీఏ, ఎఫ్ఏ, గ్రామ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం డీఆర్‌పీలు, వీఎస్ఏలు ఉన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం


ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: మున్సిపల్ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావ్ తెలిపారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉదయం పూట త్వరగా పని పూర్తి చేసుకోవాలన్నారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కార్మికులు పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫామ్‌లు అందజేయాలి


సాంగ్వి కుట్టుకేంద్రాన్ని పరిశీలిస్తున్న సీసీ శ్యాంరావు

కెరమెరి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌లను కుట్టడం వేగవంతం చేయాలని సీసీలు శ్యాంరావు, సుబ్బారావు అన్నారు. శనివారం మండలంలోని సాంగ్వి, సుర్దాపూర్ కుట్టు మిషన్ కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ నెల 5 లోపు యూనిఫామ్‌లు కుట్టడం పూర్తి చేయాలని, 6న విద్యార్థులకు అందజేయాలని పేర్కొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

బెల్లంపల్లిరూరల్(తాండూర్): గ్రామీణ యువత క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. శుక్రవారం రాత్రి తాండూర్ పోలీస్ సర్కిల్ పరిధిలోని అంకుశం గ్రామంలో సమ్మర్ వాలీబాల్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శిక్షణ పత్రాలు అందజేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని సూచించారు. అనంతరం సీఐ కుమారస్వామిని క్రీడాకారుల ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు భానుచందర్, రాజమొగిలి, శంకర్, నారాయణ, హనుమంతు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


పెంచికల్‌పేట్: తనిఖీలు చేస్తున్న అధికారులు


వాంకిడి: రికార్డులు తనిఖీ చేస్తున్న ఏవో


చింతలమానెపల్లిలో..


లింగాపూర్: రికార్డులు పరిశీలిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

పెంచికల్‌పేట్: విత్తన డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు ఎల్లూర్, ఎల్కపల్లి గ్రామాల్లో శనివారం వ్యవసాయ, రెవెన్యూ, పోలీసుశాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నిల్వలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని, ప్రతీ కొనుగోలుకు డీలర్ల వద్ద రశీదులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేని నకిలీ విత్తనాలను సాగు చేసి రైతులు మోసపోవద్దని సూచించారు. డీలర్లు దుకాణాల్లో ఉంచే నిల్వలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, నకిలీ విత్తనాలను విక్రయించిన, ప్రోత్సహించిన లైసెన్సులు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని సూచించారు. వ్యవసాయశాఖ పెంచికల్‌పేట్ ఇన్‌చార్జి ఏడీఏ రాజులనాయుడు, తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

లింగాపూర్‌లో..

లింగాపూర్: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే సీడ్స్ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ శనివారం హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేసే రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి జాడి మిలింద్ కుమార్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. విత్తనాల స్టాక్ వివరాలు, తదితర రికార్డులు తనిఖీ చేశారు. రైతులు కోరిన విత్తనాలను విక్రయించాలని ఆదేశించారు. విత్తనాల కొరత చూపి అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.


చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: విత్తన డీలర్లు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి రామక్రిష్ణ అన్నారు. శనివారం ఏవో, టాస్క్‌ఫోర్స్ పోలీసులు మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలోని విత్తనాల బ్యాగులను పరిశీలించారు. ఈసందర్భంగా డీలర్లకు పలు సూచనలు చేశారు. కృత్రిమ కొరత సృష్టించి విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ కొనుగోలుపై రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఏఈవో శ్రీనివాస్, పోలీసు సిబ్బంది సోంజీ, రావుజీ పాల్గొన్నారు.

కౌటాల: ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి షాప్ సీజ్ చేస్తామని మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని ముత్తంపేట్, కౌటాలలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు తహసీల్దార్ పుష్పలత, ఎస్సై మధుకర్, ఏవో రాజేశ్, డీటీ దిలీప్, తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్, మండల వ్యవసాయ శాఖ అధికారిణి మధులత, ఆర్ఐ ముబిన్‌లు కలిసి తనిఖీలు నిర్వహించారు. దుకాణంలోని రికార్డులను, విత్తనాలను పరిశీలించారు.

పారిశుధ్య పనులు పరిశీలన


పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

లింగాపూర్: మండల కేంద్రంలో శనివారం పంచాయతీ కార్యదర్శి రంజిత్ రెడ్డితో కలిసి ఎంపీవో ఉమర్‌షరీఫ్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని డ్రెయినేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గుడుంబాతో జీవితాలు నాశనం

- సీఐ అల్లం రాంబాబు


అవగాహన కల్పిస్తున్న సీఐ రాంబాబు

దహెగాం: గుడుంబా తాగి జీవితాలను నాశనం చేసుకోవద్దని కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని దేవులగూడెం గ్రామంలో గుడుంబా నివారణపై గ్రామస్తులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తాగి అనేక మంది మృతి చెందుతున్నారని తెలిపారు. గుడుంబా తాగడం, తయారు చేయడం మానుకోవాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై రాజు ఉన్నారు.

అనారోగ్యంతో ఆయా మృతి


ఎల్ములే తాయిబాయి (ఫైల్)

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా ఎల్ములే తాయిబాయి(65) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. గత 30 ఏళ్లుగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేశారు. తాయిబాయి అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం ఉదయం గ్రామంలో అశ్రునయనాల మధ్య ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని సిర్పూర్(టి) సీడీపీవో విజయలక్ష్మి, సిబ్బంది పద్మ, ఇందు, శ్యామల పరామర్శించారు. రూ.10 వేలు తక్షణ సాయం అందించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.